క్లుప్తంగా

గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డులో స్వాతికరెడ్డికి చోటు




విశాఖపట్నంలో అవార్డు అందుకుంటున్న స్వాతికరెడ్డి

బిక్కవోలు: మండలంలోని కొంకుదురు గ్రామానికి చెందిన కొవ్వూరి సాయి స్వాతికరెడ్డికి గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డులో చోటు దక్కింది. ఈ విషయాన్ని ఆమె తండ్రి రామారెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మహిళా మనో వికాస్ వ్యవస్థాపకురాలు మాధవి సూర్యభట్ల నేతృత్వంలో 450 మంది మహిళలు 58,112 క్రోంచట్ స్క్వేర్స్ అతి తక్కువ సమయంలో రూపొందించి గిన్నిస్‌బుక్ రికార్డు సాధించారు. ఈ బృందంలో స్వాతికరెడ్డి పాల్గొని విశాఖపటన్ంలో అవార్డు అందుకున్నట్లు తెలిపారు. గిన్నిస్ బుక్ రికార్డులో చోటు దక్కించుకున్న స్వాతికరెడ్డిని పలువురు అభినందించారు.

రేపటి నుంచి మేరీమాత జపమాల మాసోత్సవం

మధురపూడి: వచ్చే నెల 1 నుంచి 30వ తేదీ వరకూ మేరీమాత జపమాల మాసోత్సవంగా నిర్వహించనున్నట్టు పాస్టర్ కడారి మాణిక్యం తెలిపారు. కోరుకొండ ఎస్‌ఆర్ నగర్‌లోని ఆర్‌సీఎం చర్చిలో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబర్ నెలంతా మేరీమాత ప్రార్థనలు నిర్వహించాలని సూచించారు. బైబిల్ పఠనం ద్వారా మానసిక ప్రశాంతత పొందవచ్చన్నారు. ప్రపంచంలో యుద్ధాలు సమసిపోయి ప్రశాంత వాతావరణం ఏర్పడాలని కోరుతూ ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో జపమాల ప్రార్థనలు చేయాలన్నారు. కార్యక్రమంలో బెల్లపు డేవిడ్, బూసి వసంతకుమార్, జాన్ విక్టర్, సంధ్య, అమ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

కనకదుర్గ అమ్మవారికి వెండి కిరీటం సమర్పణ



దాతలు సమర్పించిన వెండి కిరీటం అలంకరణలో అమ్మవారు

రంగంపేట: మండల పరిధిలోని చంద్రేడులో కొలువైన కనకదుర్గ అమ్మవారికి భక్తులు వెండి కిరీటం సమర్పించినట్టు ఆలయ అర్చకుడు మైలవరపు కృష్ణ ఆదివారం తెలిపారు. గ్రామానికి చెందిన దాత బొడ్డు వెంకట్రావు, మంగతాయి దంపతులు రూ.31,600లతో వెండి కిరీటం తయారు చేయించి అమ్మవారికి సమర్పించారన్నారు. ప్రత్యేక పూజలు అనంతరం అమ్మవారికి వెండి కిరీటం అలంకరించినట్టు చెప్పారు.

మర్రిపూడిలో పారిశుధ్య పనులు



మర్రిపూడిలో పూడిక తీస్తున్న పారిశుధ్య సిబ్బంది

రంగంపేట: మర్రిపూడిలో ఆదివారం పారిశుధ్య పనులు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ వేము మాధవి ఆధ్వర్యంలో గ్రామంలోని పలు ప్రాంతాల్లో దోమల నివారణకు ఎబేట్ మందు పిచికారీ చేశారు. పారిశుధ్య సిబ్బంది రహదారులను, డ్రైనేజీలను శుభ్రం చేశారు. ప్రధాన కాలువల్లో పూడిక తీసి గ్రామ వెలుపలకు తరలించారు. సర్పంచ్ మాధవి మాట్లాడుతూ అంటువ్యాధులు రాకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు.

రేపు చంద్రేడు శివాలయంలో అభిషేకాలు



చంద్రేడులోని చంద్రశేఖరస్వామి

రంగంపేట: మండలంలోని చంద్రేడులో కొలువైన కాత్యాయనీ సమేత చంద్రశేఖరస్వామి ఆలయంలో స్వామివారికి మంగళవారం అభిషేకాలు నిర్వహించనున్నట్టు ఆలయ అర్చకుడు మైలవరపు కృష్ణ తెలిపారు. మాస శివరాత్రి సందర్భంగా ఈ అభిషేకాలు నిర్వహిస్తున్నామన్నారు. అభిషేకాల్లో పాల్గొనే భక్తులు తెల్లవారుజామున 4 గంటలకు ఆలయం వద్దకు చేరుకోవాలన్నారు. అభిషేకాల అనంతరం తీర్థప్రసాదాలు అందిస్తామన్నారు. అలాగే అక్టోబరు 3 నుంచి శివాలయంలో దేవీ నవరాత్రులు ప్రారంభమవుతాయని కృష్ణ తెలిపారు. రోజూ ఉదయం, సాయంత్రం అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహిస్తామన్నారు. ఈ పూజల్లో పాల్గొనే భక్తులు తమ గోత్ర నామాలు నమోదు చేయించుకోవాలని ఆయన తెలిపారు.

ఖాళీ స్థలం కనిపిస్తే కబ్జా

- రాజానగరంలో అడ్డూ అదుపు లేకుండా ఆక్రమణలు
- దారిలేక రోడ్లపై ప్రవహిస్తున్న ముంపు నీరు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు, పాలకులు



లే-అవుట్‌లోకి ముంపు నీరు చేరకుండా కల్వర్టుకు అడ్డంగా కట్టిన గోడ



రోడ్డుపై ప్రవహిస్తున్న ముంపు నీరు

రాజానగరం: నియోజకవర్గ కేంద్రమైన రాజానగరంలో ఆక్రమణలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. వ్యాపారులు ప్రధాన రహదారికి ఇరువైపులా ఆర్‌అండ్‌బీ స్థలాలను ఆక్రమిస్తుంటే రియల్ ఎస్టేట్ వ్యాపారులు చెరువులను కబ్జా చేస్తున్నారు. కొందరు తమ వ్యాపారానికి అవరోధంగా ఉందని కల్వర్టుకు అడ్డుగా గోడ కట్టేశారు. ఆక్రమణల కారణంగా వర్షాల సమయంలో ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే ముంపు నీరు దిగువకు పోయేందుకు మార్గంలేక సమీపంలోని రోడ్లపై ప్రవహిస్తోంది. దీంతో ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. అయినప్పటికీ సంబంధిత అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదనే ప్రజలు విమర్శిస్తున్నారు.

వెంచర్ నిండా ఆక్రమణలే

రాజానగరం శివారు సూర్యారావుపేటలోని పాత జాతీయ రహదారిని ఆనుకుని రియల్ ఎస్టేట్ వ్యాపారులు వేసిన వెంచర్ ఆది నుంచి ఆక్రమణల పర్వంగానే సాగుతోంది. శ్మశాన వాటిక, పుంతదారి, చెరువును ఆక్రమించుకున్న వ్యాపారులు చివరకు ముంపు నీరు దిగువకు పోయేందుకు చాగల్నాడు కాలువపై నిర్మించిన కల్వర్టును కూడా వదల్లేదు. ఇంత జరుగుతున్నా, స్థానిక అధికారులు, పాలకులు స్పందించడం లేదు. ఆక్రమణల కారణంగా వర్షాల సమయంలో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

సూర్యారావుపేటలో..

సూర్యారావుపేటలో పాత జాతీయ రహదారిని ఆనుకుని ఈ వెంచర్ ఉంది. ప్రారంభంలో పక్కనే ఉన్న శ్మశాన వాటికను ఆక్రమించిన కబ్జాదారులు స్థానికులను ప్రసన్నం చేసుకున్నారు. దాని పక్కనే ఉన్న పుంతదారిని ఆక్రమించుకుని లే-అవుట్‌కు ప్రధాన రోడ్డుగా అభివృద్ధి చేశారు. లే-అవుట్‌లో ప్లాట్లు వేస్తూ మధ్యలోని పుంతను కూడా ఆక్రమించడంతో స్థానికులు అడ్డుచెప్పే ప్రయత్నం చేశారు. ఆ సమయంలో వారు అడ్డుకోగా, చెరువులే కాదు అవసరమైతే కల్వర్టుకు అడ్డంగా గోడ కట్టేస్తాం.. ఎవరు ఏమీ చేస్తారు అంటూ వ్యాపారులు అధికార దర్పం చూపడంతో అడ్డుకోబోయిన వ్యక్తులు వెనుకడుగు వేయవలసి వచ్చింది.

కల్వర్టుకు అడ్డుగా గోడ

ఈ లేఅవుట్ ఏరియాలోనే ఉన్న చెరువులోకి ఎగువ ప్రాంతాల నుంచి ముంపు నీరు వచ్చి చేరుతుంది. ఆ విధంగా ఉంటే తమ లే-అవుట్‌కి అవరోధంగా ఉంటుందని భావించిన ఆ వ్యాపారులు ఆ చెరువుకి, ముంపు నీరు వచ్చేందుకు చాగల్నాడు కాలువపై నిర్మించిన కల్వర్టుకు సంబంధం లేకుండా అటు ఇటూ రెండు వైపులా పక్కా గోడను నిర్మించి, లేఅవుట్‌కి ముంపు బెడద లేకుండా చేసుకున్నారు. ఈ కారణంగా ముంపు నీరు దిగువకు పోయేందుకు మార్గంలేక సమీపంలోని రోడ్ల పైకి ఆ నీరు చేరి కాలువగా ప్రవహిస్తుంది. దీనివలన రోడ్డు పాడైపోయి, ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు.

రుడాయే చూసుకుంటుంది

కాగా ఈ ఆక్రమణల విషయమై స్థానిక పంచాయతి అధికారి ఎం.ప్రసాద్‌ను వివరణ కోరగా ఆ వెంచర్‌కు 'రుడా' అనుమతులు ఉన్నాయన్నారు. ఆక్రమణలు, కల్వర్టుకు అడ్డంగా గోడ కట్టడం గురించి ప్రశ్నించగా వాటిని కూడా 'రుడా' యే చూసుకుంటుందన్నారు.

ఘనంగా వరల్డ్ హార్ట్ డే



సీతానగరం రోగులకు పరీక్షలు చేస్తున్న కార్డియాలజిస్ట్ డాక్టర్ ఫణితేజ

సీతానగరం: గ్రామంలో ప్రపంచ హృదయ దినోత్సవం (వరల్డ్ హార్ట్ డే)ను ఆదివారం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. రాజమహేంద్రవరానికి చెందిన బొల్లినేని హాస్పటల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ ఎం.ఫణి తేజ రోగులకు పరీక్షలు చేశారు. అనంతరం మండల రెడ్‌క్రాస్ సొసైటీ, డాక్టర్ సత్యం రమేష్‌బాబు ఆధ్వర్యంలో కార్డియాలజిస్ట్ ఫణితేజను ఘనంగా సన్మానించారు. మండల రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు ఎస్.సుధాకర్, పి.శివ, డి.రాజు, డి. సోమయాజులు, ప్రసన్న కుమార్, హేమసుందరాచారి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు నిత్యావసరాల పంపిణీ

సీటీఆర్ఐ: విజయవాడలోని అజిత్‌సింగ్ నగర్‌లో వరద బాధితులకు రాజమహేంద్రవరానికి చెందిన గుడ్ ఫ్రెండ్స్ చారిటీ ఆధ్వర్యంలో నిత్యావసర సరకులను ఆదివారం పంపిణీ చేశారు. చారిటీ నిర్వాహకుడు నాగచక్రం మాట్లాడుతూ ఇటువంటి పరిస్థితుల్లో ప్రభుత్వం ఆర్థిక సాయం అందించడమే కాకుండా బాధితులకు మనోధైర్యాన్ని ఇవ్వాలన్నారు. కాని ఇప్పటికీ వారికి ప్రభుత్వం నుంచి సరైన సాయం అందలేదని వాపోయారు.

కన్నులపండువగా నూతన రథం ఊరేగింపు



శ్రీరంగపట్నంలో స్వామివారి రథాన్ని ప్రారంభిస్తున్న జక్కంపూడి రాజా

మధురపూడి: కోరుకొండ మండలం శ్రీరంగపట్నంలో కొలువైన విఘ్నేశ్వరస్వామి నూతన రథం ఊరేగింపు ఆదివారం కన్నులపండువగా జరిగింది. మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా స్వామివారి ఊరేగింపులో పాల్గొన్నారు. తొలుత ఆయన స్వామివారికి ప్రత్యేక పూజలు ప్రారంభించారు. అనంతరం కొబ్బరి కాయకొట్టి రథాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీరంగపట్నం కళల సంస్కృతికి నిలయంగా ఉందన్నారు. గ్రామంలో కళాకారులే అధిక సంఖ్యలో ఉన్నారన్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణలో గ్రామస్తులు ముందుంటారన్నారు. స్వామివారి నూతన రథం ప్రారంభోత్సవం, ఊరేగింపులో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. దాతల సహకారం రూ.18 లక్షలతో స్వామివారికి రథాన్ని తయారుచేయడం అభినందనీయమన్నారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖ సంతోషాలతో ఉండాలని స్వామివారిని కోరుకున్నట్టు తెలిపారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు జక్కంపూడి రాజాను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సూరిశెట్టి అప్పలస్వామి, కుటుంబరావు, దాడి వీరబాబు, కొయిదాల నానాజీ, ఆలయకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాల పోస్టర్ల ఆవిష్కరణ



చక్రద్వారబంధంలో దసరా ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం



కాపవరంలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ నాయకులు

రాజానగరం: మండలంలోని చక్రద్వారబంధం దేవీచౌక్‌లో 32వ శరనవరాత్ర ఉత్సవాలు వచ్చే నెల 3వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు ఉత్సవాల పోస్టర్‌ను ఆదివారం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఆవిష్కరించారు. దేవీ చౌక్‌లో కొలువైన జగన్మాతకు ప్రతిరోజు కుంకుమ పూజలతో పాటు ఆలయం వద్ద 15వ తేదీ వరకు వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

దసరాలో సరస్వతీదేవికి కుంకుమ పూజలు

అన్నదాన సాయిగా పేరొందిన స్థానిక షిర్డీ సాయి బాబా ఆలయంలో కొలువైన సరస్వతీమాత విగ్రహానికి దసరాలో తొమ్మిది రోజుల పాటు ఉదయం, సాయంత్రం కుంకుమ పూజలు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ పూజలకు ఎటువంటి ఫీజులు ఉండవని, పూజా సామగ్రి భక్తులే తెచ్చుకోవాలని సూచించారు.

కాపవరంలో...

మధురపూడి: కోరుకొండ మండలం కాపవరం సెంటర్‌లోని వేంచేసిన రాజరాజేశ్వరీదేవి అమ్మవారి ఆలయం వద్ద వచ్చే 3వ తేదీ నుంచి 12వ తేదీ వరకూ శరన్నవరాత్ర ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త నీరుకొండ బాబ్జి మాట్లాడుతూ ఈ ఏడాది దసరా ఉత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. తొమ్మిది రోజుల పాటు విశేష పూజలు, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. వచ్చే నెల 13న అమ్మవారి ఊరేగింపు, 17న అన్నసమారాధన నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రెసిడెంట్ పచ్చారి వెంకటరమణ, వైస్ ప్రెసిడెంట్ నల్లమిల్లి సత్తిబాబు, కాలచర్ల శ్రీను, ఉదయ మల్లేశ్వరరావు, గోకరకొండ పాపారావు, కనుబొజ్జి సూర్యచంద్రం తదితరులు పాల్గొన్నారు.

జాతీయ కార్యవర్గంలో ముగ్గురికి చోటు

ధవళేశ్వరం: పీఎంపీ అసోసియేషన్ జాతీయ కార్యవర్గంలో రాష్ట్రం నుంచి ముగ్గురికి చోటు లభించింది. ఆదివారం రాజస్థాన్‌లోని జైపూర్‌లో ఉన్న పీఎంపీ భవనంలో జాతీయ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జాతీయ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జాతీయ కార్యవర్గ ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వీబీటీ రాజు జాతీయ ప్రధాన కార్యదర్శిగా, ఆంధ్రప్రదేశ్ పీఎంపీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తోరాటి ప్రభాకరరావు జాతీయ ఉపాధ్యక్షుడిగా, కె.జనార్దన్ సహాయ కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సమావేశంలో కేంద్ర కార్యాలయాన్ని జైపూర్‌లో కొనసాగించేందుకు, జాతీయ స్థాయిలో పీఎంపీ అసోసియేషన్ పేరును కమ్యూనిటీ పారామెడిక్స్-ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్‌గా మార్పు చేసేందుకు తీర్మానించినట్లు పీఎంపీ అసోసియేషన్ నాయకులు తెలిపారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. జాతీయ నూతన అధ్యక్షుడిగా ముఖేష్ అగర్వాల్(రాజస్థాన్), జాతీయ ప్రధాన కార్యదర్శిగా వీబీటీ రాజు(ఆంధ్రప్రదేశ్), జాతీయ కోశాధికారిగా సీఎస్ రావు(గుజరాత్), సీనియర్ ఉపాధ్యక్షుడిగా ప్రదీప్ కశ్యప్(మధ్య ప్రదేశ్), ఉపాధ్యక్షులుగా ఆర్ ప్రకాష్(రాజస్థాన్), అరుణ్‌కుమార్(ఢిల్లీ), శ్యామ్‌సుందర్ పాఠక్(మధ్యప్రదేశ్), తోరాటి ప్రభాకరరావు(ఆంధ్రప్రదేశ్) తదితరులు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో పీఎంపీ అసోసియేషన్ రాష్ట్ర ప్రతినిధులు అబ్దుల్ రెహమాన్‌ఖాన్, ఎస్.వేణుగోపాల్, బళ్లా శ్రీనివాస్, దామోదర్ రెడ్డి, ఏఆర్కే పరమేశ్వర్, ఎం.జయరాం, ఎస్.సింహాచలం, పి.దేవానందం, సుభాన్, శేషయ్య, గోపాల్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సంపరలో సత్యసాయి శత జయంత్యుత్సవం



సంపరలో సత్యసాయిబాబా వారి శత జయంతి ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

పెదపూడి: సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని విశ్వశాంతి కోసం సంపర గ్రామంలో ఆదివారం 98వ నమామిసాయి రుద్రీయం పూజలు నిర్వహించారు. ఆధ్యాత్మికవేత్తలు కె.సాయి, శ్రీహరి ప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో పండితుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు సత్యసాయిబాబాకు విశేష పూజలు చేశారు. పరమేశ్వరునికి వైభవంగా ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. వేద పారాయణ చేశారు. స్థానిక సత్యసాయి సంఘ ప్రతినిధులు తిబిరిశెట్టి త్రిమూర్తులు, లక్ష్మీతులసి, కమిటీ ప్రతినిధి బి.నాగు సీత, కె.కొండయ్య కాపు దంపతులు పూజల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కాకినాడ జిల్లా సత్యసాయి సేవా సమితి అధ్యక్షుడు యార్లగడ్డ గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

2 నుంచి చదరంగం పోటీలు

ప్రకాశం నగర్ : జిల్లా చదరంగం సంఘం ఆధ్వర్యంలో వచ్చే నెల 2వ తేదీ నుంచి అండర్-9 బాలురు, బాలికల విభాగంలో స్థానిక శ్రీగౌతమి స్మార్ట్ స్కూల్‌లో జిల్లా చదరంగం పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2015 జనవరి 1 తర్వాత జన్మించిన వారు ఈ పోటీలకు అర్హులని తెలిపారు. పోటీల్లో పాల్గొనదలిచిన క్రీడాకారులు ఏపీ చెస్.ఓఆర్‌జీ వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

రహదారి.. చెరువుగా మారి..



పశ్చిమగానుగూడెం-గుమ్మళ్లదొడ్డి మధ్యలో చెరువును తలపిస్తున్న రహదారి

మధురపూడి: కోరుకొండ మండలం పశ్చిమగానుగూడెం శివారులోని రహదారిపై వర్షం నీరు నిలిచిపోయి చెరువును తలపిస్తోంది. కొద్దిపాటి వర్షం వచ్చినా నీరంతా రోడ్డుపై చేరడంతో వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. గతంలో పొలాలుగా ఉన్న ఈ ప్రాంతాన్ని లే అవుట్లుగా మార్చారు. లే-అవుట్లను మెరక చేయడంతో నీరు పల్లపు ప్రాంతానికి వెళ్లడం లేదు. లే అవుట్లు లోనుంచి నీరు రహదారిపైకి చేరుతోంది. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారిపై నీరు నిలిచిపోకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

సూర్యదేవునికి ఘనంగా శాంతి కల్యాణం



సూర్యదేవాలయంలో శాంతి కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు



సూర్యదేవుని శాంతి కల్యాణంలో మంగళసూత్రం చూపిస్తున్న అర్చకుడు వెంకటనరసింహాచార్యులు

పెదపూడి: జి.మామిడాడలో ప్రసిద్ధి చెందిన ఉష, పద్మిని, ఛాయ, సౌంజ్ఞ సమేత సూర్యనారాయణ మూర్తి స్వామి ఆలయంలో స్వామివారికి ఆదివారం శాంతి కల్యాణం ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి కల్యాణం కనులారా తిలకించి భక్తి పరవశమయ్యారు. ఆలయంలో నిర్వహిస్తున్న 12వ సప్తాహ మహోత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. ఆలయ ప్రధాన అర్చకుడు రేజేటి వెంకటనరసింహాచార్యులు చివరి రోజు ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి హోమం జరిపారు. స్థానిక తుల్యభాగ నదీపాయలో స్వామివారికి చక్రస్నానం చేయించారు. అనంతరం శాంతి కల్యాణం నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా సప్తాహ కమిటీ కన్వీనర్ నల్లమిల్లి సుబ్రహ్మణ్యేశ్వరరెడ్డి, కమిటీ ప్రతినిధులు బి.ఛత్రపతి శివాజీ, కొవ్వూరు వెంకటరెడ్డి, మేడపాటి సాయిబాబారెడ్డి, మధుప్రసాద్‌రెడ్డి, గుండాబత్తుల శ్రీనివాస్, నల్లమిల్లి అప్పారెడ్డి, నల్లమిల్లి భూలోకరెడ్డి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

యువత క్రమశిక్షణతో ఎదగాలి

సీటీఆర్ఐ: యువత ఆధునిక పోకడలతో లక్ష్యానికి దూరంగా ఉండకుండా క్రమశిక్షణతో ఎదగాలని ఎర్నెస్ట్ మోజెస్ అన్నారు. స్థానిక లూథర్ గిరి క్రైస్ట్ చర్చిలో యువజనుల దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మోజెస్ మాట్లాడుతూ దైవ వాక్యానుసారం పద్ధతిగా జీవనం సాగించాలన్నారు. యువతీ యువకులు గీతాలు ఆలపించి ఆరాధన జరిపించారు. టి.మార్టిన్ సుధాకర్, సతీష్, సుహాస్ అందించిన సంగీతం ఆహూతులను అలరించింది. కార్యక్రమంలో శ్రావణ్, మోనికా, మేరీ క్రిస్టియానా, సువర్ణకుమార్, పాస్టర్స్ జి.ప్రార్థనకుమార్, వి.డేవిడ్ కుమార్ పాల్గొన్నారు.

నగరంలో 3కే రన్



3కే రన్‌లో పాల్గొన్న జవహర్ వాకర్స్ క్లబ్ సభ్యులు

సీటీఆర్ఐ: ప్రపంచ గుండె దినోత్సవం సందర్భంగా జవహర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో నగరంలో ఆదివారం 3కే రన్ నిర్వహించారు. స్థానిక వెంకటేశ్వరనగర్‌లోని జవహర్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు సత్యనారాయణ నేతృత్వంలో వాకర్స్ అందరికీ గుండె జబ్బులపై అవగాహన కల్పించేందుకు 3కే రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర వంశీ కృష్ణంరాజు గుండె సక్రమంగా పనిచేయడానికి, గుండె జబ్బులు రాకుండా ఉండటానికి తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి వివరించారు. వయసు పైబడిన వారికే కాకుండా చిన్న పిల్లలకు కూడా గుండె జబ్బులు పెరిగిపోతున్నాయన్నారు. ప్రతిఒక్కరూ క్రమం తప్పకుండా వ్యాయమం, వాకింగ్ చేయడం వల్ల శరీరం ఫిట్‌గా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఉయ్యూరి సుబ్బరాజు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన న్యాయవాదుల క్రీడాపోటీలు

ప్రకాశం నగర్: రాజమండ్రి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులకు నిర్వహించిన రాష్ట్ర స్థాయి షటిల్, బ్యాడ్మింటన్, క్యారమ్స్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. షటిల్ డబుల్స్ విభాగంలో రాజమండ్రికి చెందిన డీవీవీ త్రినాథ్, కె.హ్యాపీ వినోద్‌లు, షటిల్ సింగిల్స్‌లో కె.హ్యాపీ వినోద్ గెలుపొందారు. రన్నర్స్ విభాగంలో అనకాపల్లికి చెందిన రోమాల అప్పలనాయుడు గెలుపొందగా మిక్స్‌డ్ డబుల్స్ విన్నర్స్ విభాగంలో కె.హ్యాపీ వినోద్, కుమారి కడియాల సరిత గెలుపొందారు. షటిల్ మహిళల సింగిల్స్, డబుల్స్ విభాగంలో విజయవాడకు చెందిన రాధా కిరణ్మయి, బి.సునీతలు విజేతలుగా నిలిచారు. చెస్ విన్నర్‌గా విజయవాడకు చెందిన ఎం.శ్రీనివాసరావు, రన్నర్‌గా శాల్మన్ రాజు గెలుపొందారు. క్యారమ్స్ విన్నర్‌గా విజయవాడకు చెందిన శ్రీనివాసరావు, రన్నర్‌గా అనకాపల్లికి చెందిన గంగాధరరావు, క్యారమ్స్ డబుల్స్ విభాగంలో విజయవాడకు చెందిన రానా ప్రసాద్ విక్టర్ గెలుపొందగా, రన్నర్స్‌గా సత్యానంద్, శ్రీనివాసరావు నిలిచారు. విజేతలకు జిల్లా ప్రిన్సిపల్ జడ్జ్ గంధం సునీత చేతుల మీదుగా మెమోంటోలు, ప్రశంసా పత్రాలు అందజేశారు.